సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



రెవెన్యూ అధికారులను పరుగులు పెట్టించిన రైతు

పెద్దతిప్పసముద్రం మండలంలోని పులికల్లు పంచాయతీ బొంతలవారిపల్లి సమీపంలో ఓ రైతు అధికారులను పరుగులు పెట్టించాడు.- 8లో



ని'బంధనాలు' ఉండవిక!

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు ఇప్పటి వరకూ ఉన్న నిబంధనలను ప్రభుత్వం సడలించింది. సాయం చేసే వారి వివరాలు గోప్యంగా ఉంచనుంది - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.112
రెండోరకం	రూ.54	రూ.80



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 203 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	490	565
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 722.80 కిలోలు



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
రాజంపేట	6.32	4.50
రాయచోటి	6.33	4.47
మదనపల్లి	6.33	4.56
పీలేరు	6.29	4.43

న్యూస్‌రీల్

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ



దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

సింహాద్రిపురం : వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కోవరంగుంటపల్లె గ్రామంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. శ్రీనాథ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనాథ్‌రెడ్డి తండ్రి ద్వారకనాథ్‌రెడ్డి, తదితర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు



రాయచోటి టౌన్ : భద్రకాళి సమేత వీరభద్ర స్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామివారికి, అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకీలో ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. పల్లకీ సేవ ఆలయపాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, శంకరస్వామి, చంద్రోఖర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

తుపాకి లైసెన్సులపై అసత్య ప్రచారం చేస్తే చర్యలు

కడప అర్బన్ : జిల్లాలో తుపాకి లైసెన్సులపై అవాస్తవాలు, అసత్య ప్రచారం చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. 2014 నుంచి 2019 వరకు జిల్లాలో 117,. 2019 నుంచి 2023 ఇప్పటివరకు 159 లైసెన్సులను మంజూరు చేశామన్నారు.

పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ 4న కొత్త జిల్లాలను ప్రకటించింది. రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఆవిర్భావానికి నాంది పలికింది. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతోంది. ప్రజల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. అన్నమయ్య జిల్లా ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం..

నవోత్సాహం..!



- అన్నమయ్య జిల్లా ఆవిర్భావానికి నేటితో ఏడాది పూర్తి
- జిల్లా కేంద్రంలో ఒనగూరిన వసతులు
- అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ భవనాలు
- ప్రజలకు పాలన చేరువ కావడంపై సర్వత్రా హర్షం

సాక్షి,రాయచోటి : చరిత్రాత్మక ఘట్టానికి ఏడాది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆవిర్భవించిన అన్నమయ్య జిల్లా వసంతాన్ని దాటుతోంది. ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాలోని ఆరు నియోజకవర్గాలను జిల్లాగా మార్చడంతో నూతన ఒరవడికి నాంది పలికారు. కొత్త జిల్లాగా పురుడు పోసుకున్న ఏడాదిలోనే అన్ని సమస్యలను అధిగమించి నూతన సౌకర్యాలతో పాత జిల్లాలతో పోటీ పడుతూ కొత్త జిల్లా అన్నమయ్య నవశకం వైపు పయనిస్తోంది. ఒడివడిగా అభివృద్ధికి అడుగులు పడుతూ..సమస్యలను దూరం చేస్తూ కొత్త పాలనలోని ఫలాలను అధికారులు ప్రజలకు అందిస్తున్నారు.

చారిత్రక ప్రాశస్త్యం కలిగిన రాయచోటి ప్రాంతం అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి నూతన శకం ఆరంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ప్రజా సంకల్ప పాదయాత్ర సందర్భంగా ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా మారుస్తానని ప్రకటించి అందుకు అనుగుణంగా హామీని నెరవేర్చడంపై సర్వత్రా సంబరాలు చేసుకున్నారు.

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకున్న ప్రాంతం ఒకప్పుడు కరువు కాటకాలకు నిలయంగా ఉంటూ తాగునీటితోపాటు అనేక సమస్యలను ఎదుర్కొంటూ వచ్చింది. అయితే మారిన పరిస్థితులు, మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పలు ప్రాజెక్టులను నిర్మించి తాగునీటి సమస్యను రూపుమాపగా ఆయన తనయుడు అన్నమయ్య పేరుతో కొత్త జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా చరిత్రలో నిలిచిపోయారు.

చరిత్రలో ఓ మైలు రాయి

చరిత్రలో కొత్త జిల్లా ఓ సువర్ణ అధ్యాయంగా చెప్పవచ్చు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరుతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలను కలుపుకుని అన్నమయ్య జిల్లాగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కడప జిల్లాలో 1807 నుంచి నాటి చిత్తూరు జిల్లాలోని మదనపల్లి, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలు 1911 వరకు కలిసే ఉండేవి. ఆ తర్వాత జిల్లాల విభజనతో అవి కడప జిల్లా నుంచి విడిపోయి చిత్తూరు జిల్లాలో చేరాయి. రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట కడప జిల్లాలోనే 1807 నుంచి కొనసాగుతూ వచ్చాయి. ఇలా చరిత్రలో ఆయా నియోజకవర్గాలు రెండు శతాబ్దాలకు పైగా ఉమ్మడి జిల్లాలో ఉండి ప్రస్తుతం పునర్విభజనలో మరో జిల్లాలో చేరాయి.

అన్నమయ్య జిల్లాలో ఒనగూరిన సౌకర్యాలు


అన్నమయ్య జిల్లాకు సంబంధించిన పాలన ప్రారంభించిన నాటికే వసతులు ఒనగూరాయి. గిరిజన సంక్షేమ శాఖకు చెందిన భవనాల్లో కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ భవనాలు ఉండగా.. ఉర్దూ ఐటీఐ భవనాల్లో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను స్థాపించారు. నూతన ఎస్పీ కార్యాలయానికి పాలిటెక్నిక్ కళాశాల భవనాలను కేటాయించారు. కొత్త జిల్లా ఏర్పడిన అనంతరం మౌలిక వసతుల్లో భాగంగా ఎక్కడికక్కడ ఫర్నీచర్, కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలు, ఇతర అవసరమైన సామగ్రిని వెంటనే అందించడంతోపాటు సిబ్బందిని కూడా సర్దుబాటు చేశారు. సుమారు 102కు పైగా శాఖలకు సంబంధించి వేలాది మంది ఉద్యోగులు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఎక్కడా కూడా ప్రైవేటు భవనాలు కాకుండా ప్రభుత్వ భవనాల్లోనే సర్దుబాటు చేశారు. దీంతో ప్రత్యేకంగా అద్దె బాధ తప్పిపోగా, కార్యాలయాల్లోనే పనులు సజావుగా సాగిపోతున్నాయి.

కొత్త పాలనతో నవశకం

2022 ఏప్రిల్ 4వ తేదీన కొత్త జిల్లాలు ఆవిర్భవించాయి. అప్పటి నుంచి ఎక్కడికక్కడ అధికారులు అందుబాటులోకి రావడంతో ప్రజల వద్దకే పాలన వచ్చింది. పునర్విభజనలో జిల్లాలు చిన్నవి కావడంతో ప్రజల సమస్యలు కూడా వేగంగా పరిష్కారం అవుతున్నాయి. అలాగే క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు అధికారులకు అవకాశం లభిస్తోంది.

జిల్లా సమాచారం

విస్తీర్ణం	7951 చ.కి.మీ.
మండలాలు	30
గ్రామాలు	5673
రెవెన్యూ గ్రామాలు	471
గ్రామ పంచాయతీలు	502
అసెంబ్లీ నియోజకవర్గాలు	06
పార్లమెంటు నియోజకవర్గాలు	01
మున్సిపాలిటీలు	03
నగర పంచాయతీలు	01
జనాభా	16.97 లక్షలు
పురుషులు	8.53 లక్షలు
మహిళలు	8.44 లక్షలు
పట్టణ జనాభా	13.06 లక్షలు
గ్రామీణ జనాభా	3.91 లక్షలు



ఆవిర్భావానికి ఏడాది

అన్నమయ్య జిల్లా ఆవిర్భవించి సరిగ్గా నేటికి ఏడాది పూర్తయింది. గతేడాది ఇదేరోజున కొత్త జిల్లాగా అన్నమయ్య పురుడు పోసుకుంది. జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రభుత్వం ఎంపిక చేసి పరిపాలన అందించేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆరు నియోజకవర్గాలు, 30 మండలాలతో ఏర్పడింది. జిల్లా ఏర్పాటుతో ప్రజలకు అన్ని సౌకర్యాలు ఒనగూరడంతోపాటు పాలన కూడా అందుబాటులోకి వచ్చింది. అంతే కాకుండా జిల్లా కేంద్రం నుంచి చుట్టు మండలాలకు వెళ్లాలన్నా 120 కిలోమీటర్లలోపు ఉండడంతో అధికారుల పర్యటనలు కూడా వేగంగా సాగిపోతున్నాయి. కొత్త పాలనపై ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు సీఎం వైఎస్ జగన్ ఒంటిమిట్టకు రాక



కడప సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో పర్యటించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఒంటిమిట్టలో జరుగుతున్న కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆయన హాజరై స్వామి వారిని దర్శించుకోనున్నారు.

పర్యటన వివరాలిలా.. ఈనెల 5వ తేదీన

- మధ్యాహ్నం 12.50 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 1.10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళతారు.
- 1.15 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 2.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 2.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 2.35 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహానికి చేరుకుంటారు.
- 3.25 గంటలకు టీటీడీ అతిథి గృహం నుంచి బయలుదేరి కోదండరామస్వామి ఆలయానికి చేరుకుంటారు.
- 3.30 నుంచి 3.50 గంటల వరకు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి టీటీడీ అతిథి గృహం చేరుకుంటారు..
- 4.25 గంటలకు టీటీడీ అతిథి గృహం నుంచి బయలుదేరి 4.55 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 5.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 5.45 గంటలకు గన్నవరం చేరుకుని 6.10 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదు

జేసీ తమీమ్ అన్సారియా

రాయచోటి : ప్రజలలో సంతృప్తి స్థాయిని పెంచే విధంగా స్పందన అర్జీల పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం కలెక్టరేట్ స్పందన హాలులో అర్జీదారుల నుంచి విజ్ఞప్తులను ఆమె స్వీకరించారు. అర్జీల స్వీకరణలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకుంటుందన్నారు. గడువులోగా సమస్యకు పరిష్కారం చూపకుంటే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితిలో పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఏ రోజుకారోజు సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా

పేద విద్యార్థులు కల సాకారం చేసుకోవాలి

జిల్లాలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలతో పేద విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. పేద విద్యార్థులకు ఇదొక సువర్ణ అవకాశమన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం పొందాలనుకునే పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించడానికి సహాయ కేంద్రాల సహకారం తీసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రవేశాల కోసం ఏప్రిల్ 10వ తేదీలోపు www.cse.ap.gov.in/RTE వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే సమీపంలో ఉన్న గ్రామ సచివాలయంలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డీఈఓ పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి మొత్తం 50 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నవనీత కృష్ణాలంకారం.. ముగ్ధమనోహరం



నవనీతకృష్ణుడికి హారతి ఇస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలో వెలసిన కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం ఉదయం స్వామి నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భక్త జన బృందాలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం కృష్ణుడు వెన్న దొంగ, రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంటిలోనే గాక అందరి ఇళ్లల్లో దూరి వెన్న దొంగతనంగా ఆరగించేవాడు. ఈ చిన్ని కృష్ణుడిని లీలలను గుర్తు చేస్తూ రాముల వారు వెన్న కుండతో భక్తులకు దర్శన మిచ్చారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. రాత్రి ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో హనుమంత వాహనంపై భక్తవత్సలుడిలా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

అశ్వవాహనంపై ప్రతాపరాముడి పార్వేట

వాల్మీకిపురం : వాల్మీకిక్షేత్రంలోని పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం రాత్రి 8 గంటలకు స్వామివారు అశ్వవాహనంపై పార్వేటకు బయల్దేరారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, తిరుచ్చిలో స్వామివారి అలంకరణ జరిగింది. 8 నుంచి 9 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం, స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. సాయంత్రం ఊంజల్ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం వాహన మండపంలో స్వామివారిని విల్లంబులు ధరింపజేసి పార్వేటకు సిద్ధం చేశారు. అశ్వవాహనంపై విల్లంబులతో భక్తులకు ప్రతాపరాముడిగా దర్శనమిచ్చారు. పార్వేట మండపంలో ఆలయ అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు రాములవారి పార్వేట ఉత్సవం గురించి కథారూపంలో భక్తులకు తెలియజేశారు. వేట అనంతరం స్వామివారు తిరుమాఢ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశంత్, నాగరాజ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న పట్టాభిరాముడు

పది పరీక్షలు తొలిరోజు ప్రశాంతం



సిద్దవటంలోని పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- 296 మంది విద్యార్థులు గైర్హాజరు
- బుక్‌లెట్‌తో వెళ్లిన విద్యార్థి డీబార్.. ఇన్విజిలేటర్ సస్పెన్షన్... చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు షోకాజ్ నోటీసులు

రాయచోటి : జిల్లాలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజైన సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 123 కేంద్రాలలో 22,395 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. అయితే 22,204 మంది విద్యార్థులు హాజరు కాగా 296 మం గైర్హాజరైనట్లు డీఈఓ పురుషోత్తం తెలిపారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించేది లేదని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించడంతో విద్యార్థులు దాదాపుగా పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాల ముందే చేరుకున్నారు. సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లాలో 43 సెంటర్లను పరిశీలించింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. జిరాక్స్ సెంటర్లు కూడా మూయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

బుక్‌లెట్‌తో వెళ్లిన విద్యార్థి డిబార్

రాయచోటి పట్టణం మాసాపేట పాఠశాలలో పదవ తరగతి పరీక్ష రాస్తున్న ఒక విద్యార్థి బుక్‌లెట్ తీసుకొని పరీక్షా కేంద్రం నుంచి బయటికి వెళ్లిపోయాడు. దీంతో ఆ విద్యార్థిని డీబార్ చేసినట్లు డీఈఓ తెలిపారు. ఆ కేంద్రంలోని ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశామన్నారు. అలాగే చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ, ఏఎస్పీ

పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్‌లు విడివిడిగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై జేసీ ఆరా తీయగా, పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలపై ఏఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

బంగారు నగల చోరీ

కలికిరి : కలికిరి పట్టణ పరిధిలోని టీబీ రోడ్డు ఏరియాలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని టి.బి. రోడ్డులో నివాసం ఉంటున్న పి.సుబ్రమణ్యం ఆదివారం రాత్రి భార్య, పిల్లలతో ఇంటికి తాళాలు వేసి మిద్దెపైన పడుకున్నారు. సోమవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో మిద్దె దిగారు ఇంటి తాళాలు పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 80 గ్రాముల బంగారు, నగదు దోచుకెళ్ళినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్ఐ మధుసూద నాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. అలాగే టి.బి.రోడ్డు ప్రాంతంలోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పోలీస్ క్యాంటీన్ తనిఖీ

రాయచోటిటౌన్ : రాయచోటి పోలీసు క్యాంటీన్ అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ అకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఆయన నేరుగా క్యాంటీన్‌కు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.దీని స్థాయి పెంచుతున్న నేపథ్యంలో అధునాతన వసతులు కల్పించారు. గదుల్లో ఏర్పాటు చేస్తున్న ర్యాక్‌లను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

గడ్డియంత్రంలో చేయిపడి తెగిన వేళ్లు

తంబళ్లపల్లె : ఓ మహిళా రైతు గడ్డియంత్రంలో గడ్డి కత్తిరిస్తుండగా చేతివేళ్లు తెగిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలో జరిగింది. కుటుంబీకుల కథనం మేరకు ఆర్ఎన్‌తాండా పంచాయితీ ఎద్దులవారికోటకు చెందిన శ్రీనివాసులు భార్య మహిళారైతు గురుదేవి (35), గడ్డియంత్రంలో గడ్డి కట్ చేస్తుండగా కుడిచేయి యంత్రంలో పడి నాలుగు వేళ్లు తెగిపోయాయి. కుటుంబీకులు బాధితురాలిని మదనపల్లెజిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

ని‘బంధనాలు’ ఉండవిక

రోడ్డుప్రమాద బాధితులకు సాయం చేస్తే చిక్కులుండవ్

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు ఇప్పటి వరకూ ప్రభుత్వం నిబంధనలు కఠినతరంగా ఉండేవి. తాజాగా ప్రమాద బాధితులకు సహాయం చేసేవారికి అనుకూలంగా గతంలో సుప్రీం కోర్టు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ప్రమాద బాధితులకు సహాయం చేసేవారికి అండగా నిలుస్తుంది. వీరిని వేధింపులకు గురిచేసేందుకు వీలు లేదు. వారి వివరాలు కూడా గోప్యంగా ఉంచుతారు.


రోడ్డు ప్రమాద దృశ్యం

కడప కార్పొరేషన్ : ఒకటి కాదు...రెండు కాదు.. రోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణమైంది. భారత దేశంలో ప్రతి నాలుగు నిముషాలకు రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారని ఓ సర్వే చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రమాదంలో గాయాలపాలైన వారికి వైద్య సేవలు అందించేందుకు ఇదివరకూ ప్రభుత్వ నిబంధనలు ప్రతిబంధకంగా ఉన్నాయి. బాధితుల అత్యవసర పరిస్థితి చూసి ఎవరైనా స్పందించి ఆసుపత్రిలో చేర్చినా, వారిని పోలీసులు విచారణ పేరుతో వేధించేవారు. వివరాలు సేకరించే నెపంతో గంటల తరబడి నిలిపి ఉంచేవారు. ఇది చాలదన్నట్లు కేసులంటూ కోర్టుల చుట్టూ తిప్పేవారు. ఫలితంగా ఈ నిబంధనల తలనొప్పి మాకెందులే...అని జనం సాయం చేసేందుకు ముందుకు వచ్చేవారు కాదు. ఎవరైనా ప్రమాదం బారిన పడి రోడ్డుపై సాయం కోసం అర్థిస్తున్నా, రక్షించేందుకు అవకాశం ఉన్నా కూడా ఎవరూ బాధ్యత తీసుకొనేందుకు సిద్ధపడే వారు కాదు.

■ రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందించేందుకు వారికి సమీపంలోని ఆస్పత్రికి తరలించేవారికి ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సుప్రీం కోర్టు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం గతంలో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రమాద బాధితులకు సాయం చేసేవారు తమ వివరాలను చెప్పకపోయినా..వారు తీసుకొచ్చిన క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్చుకోవాల్సిందే. వారు తమ వివరాలను వెల్లడించి స్వచ్ఛందంగా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబుతామంటేనే పోలీసులు వారి వివరాలు నమోదు చేసుకోవాలి. లేనిపక్షంలో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించి రక్షకులు వెళ్లిపోవచ్చు. ఈ సరికొత్త గెజిట్ ఏయే నిబంధనలు ఉన్నాయంటే..

పేరు చెప్పాల్సిన పనిలేదు

రోడ్డు ప్రమాద బాధితులను సమీపంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకొని రావచ్చు. ఆతన్ని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి తమ వివరాలు, చిరునామా చెప్పి వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవచ్చు. అంతకు మించి ఆస్పత్రి సిబ్బంది రక్షించిన వ్యక్తిని వివరాలేమీ అడగరు. ఉండమని చెప్పరు. సాయం చేసిన వారి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించకూడదు. ఇలా చేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు.

ఎవరైనా రోడ్డు ప్రమాదానికి ప్రత్యక్ష సాక్షి అయితే కేసు దర్యాప్తులో భాగంగా తన వివరాలను పోలీసులకు అందజేయవచ్చు. వీరు కేసు విచారణలో సాక్ష్యం చెప్పేందుకు ఒక్కసారి కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుంది. అతన్ని విచారణ పేరిట పోలీసులు వేధింపులకు గురిచేయకూడదు. ఎప్పుడు రావాలో సదరు సాక్షికి తెలియజేయాలి. తరువాత అతన్ని కోర్టుకు పిలువకూడదు.

విలువైన కాలం

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సాయం చేసేవారు చాలా అరుదు. రోడ్డుపై రక్తం కారుతూ ఎవరైనా పడిఉన్నా పట్టించుకోకుండా పోయేవారే ఎక్కువ. ఇందుకు నిబంధనలు కూడా ఒక కారణమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడటానికి ప్రతిక్షణం అమూల్యమైనదే. ఈ క్షణాలను గోల్డెన్ అవర్స్‌గా పిలుస్తారు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో సాయం చేయాలని ఎంత మనస్సు ఉన్నా నిబంధనలు, కేసుల భయంతో ఎవరూ ముందుకు రాకపోవచ్చు. ఇటువంటి సమస్యలు లేకుండా క్షణం ఆలస్యం చేయకుండా బాధితులను ఎవరైనా ఆసుపత్రికి తరలించేలా సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపగయోపడుతాయి. బాధితులను ఆస్పత్రిలో చేర్పించిన వారిపైగానీ, కొత్త గెజిట్‌పైగానీ ఏవిధమైన సివిల్, క్రిమినల్ కేసులు పెట్టేందుకు అవకాశం లేదు.

గాయపడిన వారికి సత్వరమే వైద్యం

ప్రమాద బారిన పడిన క్షతగాత్రులకు తక్షణమే చికిత్స అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉంది. సరైన కారణం లేకుండా వైద్యుడు చికిత్స చేసేందుకు నిరాకరిస్తే అతనిపై ఇండియన్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఈ నిబంధనలు తక్షణమే అమలు చేయాల్సి ఉంటుంది.

బ్రహ్మోత్సవాలకు 118 ప్రత్యేక బస్సులు

కడప సిటీ : ఒంటిమిట్టలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల రవాణా సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ఏప్రిల్ 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 118 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈబ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో రవాణా పరంగా ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ 118 ప్రత్యేక బస్సులను ఆయా ముఖ్య ప్రదేశాల నుంచి రూట్ల వారీగా కేటాయించడం జరిగిందని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు.

■ కడప డిపో నుంచి 45, పులివెందుల 10, బద్వేలు 20, జమ్మలమడుగు 10, మైదుకూరు 5, ప్రొద్దుటూరు డిపో నుంచి 20 బస్సులతోపాటు ఇతర రీజినల్ డిపోల నుంచి 8 బస్సులను నడపనున్నారు.

■ 5వ తేది నిర్వహించే కల్యాణం రోజున కడప వైపు నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశం నుంచి కల్యాణ వేదిక వరకు భక్తులను తరలించేందుకు నాలుగు ఉచిత బస్సులు, అలాగే రాజంపేట వైపు నుంచి వచ్చే వాహనాలపార్కింగ్ ప్రదేశం నుంచి కల్యాణ వేదిక వరకు ఆరు బస్సులను ఏర్పాటు చేశారు.

దేవదాయశాఖలోకి గంగమ్మ సన్నిధి?

రాజంపేట టౌన్: బలిజపల్లె గంగమ్మ జాతర విషయమై నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదాల గురించి పత్రికల్లో వార్తలు రావడంతో సోమవారం దేవదాయశాఖ రాజంపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ చాపల శివయ్య గంగమ్మ ఆలయ సన్నిధి, తదితర ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామస్తుల నుంచి పలు వివరాలను సేకరించినట్లు ఆయన తెలిపారు. తమ విచారణలో వెల్లడైన వివరాలను నివేదిక రూపంలో అధికారులకు అందచేయనున్నట్లు శివయ్య తెలిపారు. ఇదిలా ఉంటే అమ్మవారికి వస్తున్న ఆదాయం ఏమవుతుంది అన్న విషయాలపై కూడా ఇన్‌స్పెక్టర్ ఆరా తీసినట్లు తెలిసింది. దాదాపు పన్నెండేళ్ల క్రితం కూడా కొంత మంది నిర్వాహకుల మధ్య జాతర విషయంలో తరచూ వివాదాలు జరుగుతుండేవి. దీంతో అధికారులు గంగమ్మకు కానుకల రూపంలో వస్తున్న ఆదాయం, అమ్మవారికి ఉన్న ఆభరణాల వివరాలను సేకరించి గంగమ్మ సన్నిధిని దేవదాయశాఖలోకి తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అయితే ఆ సమయంలో కొంతమంది జాతర నిర్వాహకులు కోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రస్తుతం కొంతమంది నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదంతో పాటు అమ్మవారికి కానుకల రూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వస్తుండటం, అది పరుల పాలవుతున్న విషయం దేవదాయశాఖ అధికారుల దృష్టికి వెళ్లింది. ఈనేపథ్యంలో మళ్లీ అమ్మవారి సన్నిధిని దేవదాయశాఖలోకి తీసుకునేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

విద్యుత్ స్తంభం పునరుద్ధరణ పనుల్లో అపశ్రుతి


గంగయ్య మృతదేహం

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయరహదారిలోని రామాపురం చెక్‌పోస్టు సమీపంలో సోమవారం ఓ కారు విద్యుత్‌స్తంభాన్ని ఢీకొంది. స్తంభం పునరుద్ధరణ పనులను ఏపీఎస్పీడీసీఎల్ కార్మికులు చేపట్టారు. పనులు పూర్తయిన తరుణంలో విద్యుత్ సరఫరా విషయంలో అవగాహనలోపంతో ప్రైవేటు లైన్‌మెన్ (పీఎల్ఎం) గంగయ్య(42) ప్రమాదవశాత్తుకు విద్యుదాఘాతానికి గురయ్యాడు. విద్యుత్ స్తంభం నుంచి కింద పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్‌సీ తీసుకునే విషయంలో లైన్‌మెన్, ప్రైవేటు అసిస్టెంట్‌లైన్‌మెన్‌కు మధ్య ఎటువంటి చర్చలు జరిగాయో తెలియడంలేదు. మృతుడు శేషమాంబపురానికి చెందిన వాడిగా గుర్తించారు. అధికారుల నిర్లక్ష్యం వలనే గంగయ్య మృతి చెందినట్లు ఆరోపణలు వెలువడ్డాయి.

ఏడీఈ ఏమంటున్నారంటే..

మృతి చెందిన వ్యక్తి డిపార్టుమెంట్‌కు చెందినవారు కాదని రాజంపేట ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ సురేంద్ర తెలిపారు. ఎల్‌సీ విషయంలో నిర్ధారణకు రాకుండానే విద్యుత్ స్తంభం ఎక్కి ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

రెవెన్యూ అధికారులను పరుగులు పెట్టించిన రైతు


జగనన్న లేఔట్‌లో నిల్వ ఉంచిన రాతి దూలాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పులికల్లు పంచాయతీ బొంతలవారిపల్లి సమీపంలో 442/బీ-1 లోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు 14 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు జగనన్న లేఔట్ వద్దకు సోమవారం వెళ్లగా బొంతలవారిపల్లికి చెందిన రైతు లక్ష్మీనారాయణ, అతడి భార్య రూపమ్మ, కుమారుడు విజయకుమార్ రెడ్డిలు అడ్డుకున్నారు. అంతేగాక 20 ఏళ్ల క్రితమే ఈ స్థలంలో తాము పైప్‌లైన్ వేశామని చెబుతూ సదరు స్థలంలో ఇంటి పైకప్పు రాతి దూలాలను నాటేందుకు ప్రయత్నించి లబ్ధిదారులతో వాగ్వివాదానికి దిగాడు. దుర్భాషలాడారు. దీంతో లబ్ధిదారులు జరిగిన ఘటనపై సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే సిబ్బందితో కలసి ఆయన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో వేసిన పైప్‌లైన్ తొలగించేందుకు చర్యలు చేపట్టగా అక్కడే ఉన్న రైతు కుమారుడు విజయ్‌కుమార్‌రెడ్డి ముందుగానే వెంట తెచ్చుకున్న క్రిమి సంహారక మందు బాటిల్ తీసి నోట్లో పోసుకుని పరుగులు పెట్టాడు. దీంతో అధికారులు హైరానా పడ్డారు.తక్షణం రెవెన్యూ సిబ్బంది రెండు కిలోమీటర్ల పాటు వెంబడించగా ఓ చెట్టు కింద పడుకున్న అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించడమే గాక లేఔట్‌లోని లబ్ధిదారులను దూషించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వారిని బైండోవర్ చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ : 8 మందిపై కేసు

కలకడ : మండలంలోని కోన గ్రామంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు ..కోనగ్రామానికి చెందిన కత్తి ఈశ్వరయ్య భార్య గీతను వారి ఇంటివద్ద అదే గ్రామానికి చెందిన కత్తి రమణ, ఆయన భార్య శారద, కత్తిలలితమ్మ, ఉపేంద్ర, నందినిలు కొట్టి గాయపరిచారు. గీత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఐదుగురిపై పోలీసలు కేసు నమోదుచేశారు. ఇదే ఘర్షణలో రామ్మోహన్‌భార్య లలితమ్మను ఈశ్వరయ్య, ఆయన భార్య, కుమార్తె జాహ్నవి కొట్టారు.లలితమ్మ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన సోమవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. వాల్మీకిపురం పట్టణంలోని తిరుపతి రోడ్డుకు చెందిన మనోహర్ భార్య అక్షయ(22) విషద్రావణం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వాల్మీకిపురం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి

కలికిరి: మండలంలోని మునెళ్ళపల్లి గ్రామ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు ధనుంజయపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మాబు సాహెబ్ తెలిపారు. వివరాలు.. మునెళ్ళపల్లి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గత నెల 9న విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు దారిలో కాపుకాచి కళ్లలో పౌడర్ చల్లి దాడి చేశారు. ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. బాధితున్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్ దాడి ఘటనపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వృద్ధుడిపై..

మదనపల్లె: భూమి విషయమై జరిగిన ఘర్షణలో వృద్ధుడిపై దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ పంచాయతీ గంగన్నగారిపల్లెకు చెందిన గోపాల్ (60) కు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన రామచంద్ర ఆక్రమించుకున్నాడని గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న రామచంద్ర ఆదివారం రాత్రి ఒంటిరిగా వెళుతున్న గోపాల్‌పై దాడి చేశాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడవలితో..

నంబేపల్లె : మండల కేంద్రంలోని గంగులయ్యపై కొడవలితో దాడిచేసిన నామాలగుట్ట చెందిన రవిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ షరీఫ్ కథనం మేరకు మండలంలోని టీటీడీ కల్యాణమండపం సమీపంలోని చిల్లదుకాణం యజమాని గంగులయ్యను ఆదివారం రాత్రి నామాలగుట్టకు చెందిన ఓ వ్యక్తి పెట్రోల్ కావాలని అడగాడు. లేదని చెప్పడంతో గంగులయ్య దుకాణంలో కొడవలి తీసుకొని దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


పార్వతి (ఫైల్)

వాల్మీకిపురం : ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన వాల్మీకిపురం పట్టణం ఐఏవై కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఐఏవై కాలనీకి చెందిన నరసింహులు కుమార్తె పార్వతి (35) నర్సుగా పని చేస్తోంది. ఏమైందో కానీ కాలనీ సమీపంలో వివస్త్రగా ఓ చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వివస్త్రగా ఉన్న పార్వతి మృతదేహానికి స్థానికులే దుస్తులు కప్పారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి సీఐ నాగేంద్ర, ఎస్ఐ బిందుమాధవి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పార్వతిది హత్య లేదా ఆత్మహత్య అన్న నిజానిజాలు పోలీసుల దర్యాప్తులో తేల్చాల్సి ఉంది.

మనవళ్లను హాస్టల్‌లో వదిలేందుకు వెళుతూ..

ఖాజీపేట (వైఎస్ఆర్ జిల్లా) : పుల్లూరు పంచాయతీలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుల్లపల్లె పెద్ద ఓబయ్య (58) మృతి చెందాడు. ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వివరాలు.. సిద్దవటం మండలం జ్యోతి గ్రామానికి చెందిన పెద్ద ఓబయ్య మనవళ్లు ఖాజీపేట మండలం అప్పనపల్లెలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. ఇటీవల వరుసగా నాలుగురోజులు సెలవులు రావడంతో వారిని ఇంటికి తీసుకెళ్లారు. తిరిగి హాస్టల్‌లో వదిలేందుకు సోమవారం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. పుల్లూరు పంచాయతీ అంబేడ్కర్ కూడలి వద్దకు రాగానే మైదుకూరు నుంచి కడపకు వెలుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో పెద్ద ఓబయ్య అక్కడిక్కడే మృతి చెందగా అరవింద్, అభివర్మలకు స్వల్పగాయాలయ్యాయి. ఓబయ్య మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కుళ్లయప్ప తెలిపారు.

బైక్‌ల ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

రాయచోటిటౌన్ : రాయచోటి – కడపకు వెళ్లే దారిలో మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సర్కిల్ వద్ద స్కూటీ, రాయల్ ఎన్‌ఫీల్డ్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాయచోటి రూరల్ పరిధిలోని వరిగకు చెందిన ఆర్ వెంకటరమణ రాయచోటి పట్టణంలో కాపురం ఉంటున్నాడు. ఇతని కుమార్తె 10వ తరగతి పరీక్షలు రాస్తోంది. సోమవారం కుమార్తెను సాయి ఇంజనీరింగ్ కళాశాలలో స్కూటీలో దిగబెట్టి తిరిగి బయలుదేరాడు. అదే సమయంలో రాయచోటివైపు నుంచి రంజిత్‌కుమార్ ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. గమనించకుండా వెంకటరమణ రోడ్డుకి రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. రంజిత్ స్వల్పంగా, వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేస్తామన్నారు.

సత్ఫలితాల దిశగా పోలీసుల చర్యలు

రాయచోటి: అన్నమయ్య జిల్లా పోలీసులు సెల్ ఫోన్ల రికవరీ చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఫలితంగా ఖరీదైన సెల్‌ఫోన్లు తిరిగి పోగొట్టుకున్న వారిచేతికి అందుతుండటంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో రూ. 23 లక్షలు విలువచేసే 109 మొబైల్ ఫోన్లు అందజేయగా, రెండో విడతలో 130 మొబైల్ ఫోన్లు (రూ. 26లక్షలు) రికవరీ చేసి ఎస్పీ చేతులు మీదుగా బాధితులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మొబైల్స్ ట్రేస్ చేసిన సైబర్ క్రైమ్, టెక్నికల్ ఎనాలిసిస్ విభాగాల సిబ్బందిని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు విడతలుగా రూ. 49 లక్షలు విలువచేసే 239 మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారివి ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్పీ వివరించారు. ఇకపై కూడా మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీస్ వాట్సప్ నంబరు. 8688830012కు హాయ్ అని టైప్ చేయడం ద్వారా https://forms.gle/CCWgUGkATEbses489 లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేశామన్నారు. జిల్లా పోలీసులకు మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఇల్లు ఒకరిది.. బిల్లు మరొకరికి

బి.కొత్తకోట : నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇంటిని నిర్మించుకుంటున్న లబ్ధిదారుని ఖాతాకు వెళ్లాల్సిన బిల్లు సొమ్ము మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఖాతాకు జమ అయింది. దీనిపై లబ్ధిదారు తమకు న్యాయం చేయాలంటూ విన్నవిస్తోంది. వివరాలు .బి.కొత్తకోట మండలం సూరపువారిపల్లెకు చెందిన కే.శంకరమ్మకు ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేసింది. దీనికి సంబంధించి ఇంటినిర్మాణం చేపట్టగా అధికారులు బిల్లులు చెల్లించేందుకు రికార్డు చేశారు. ఆన్‌లైన్‌లో బిల్లు మంజూరుకు రూ.70వేలు నివేదించగా గత డిసెంబర్ 23న ప్రభుత్వం బిల్లును మంజూరు చేసింది. రూ.70వేలు ఖాతాకు జమ చేసింది. అయితే ఆ నగదు బిల్లు శంకరమ్మ ఖాతాకు జమ కాలేదు. ఆమె అధికారులను కలిసి విన్నవించగా ఆన్‌లైన్‌లో బిల్లు రూ.70 వేలు చెల్లింపు జరిగిందని నిర్ధారించారు. దీనికి సంబంధించి ఆన్‌లైన్ వివరాలు సరిచూడగా శంకరమ్మ పేరుతో ఆధార్, స్థానిక బ్యాంకు ఖాతా నంబర్ ఉన్నప్పటికీ మంజూరైన బిల్లు మధ్యప్రదేశ్‌లోని మనోవర్ జిల్లాకు చెందిన ఛోటు భారత్ అనే వ్యక్తి ఖాతాకు రూ.70వేలు జమ అయింది. దీనిపై తనకు బిల్లు సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని శంకరమ్మ హౌసింగ్ అధికారులను విన్నవిస్తోంది. ఈ సమస్యపై బ్యాంకు అధికారులతో చర్యలు తీసుకొంటున్నామని, బిల్లు నగదు తిరిగి వస్తుందని హౌసింగ్ అధికారులు చెప్పారు.

జిల్లా కోర్టుకు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్‌బాక్స్‌లను మంగళవారం జిల్లా కోర్టుకు తరలించనున్నారు. అక్కడ వాటిని భద్రపరచనున్నారు.ఈ మేరకు హైకోర్టు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గత నెల 31న జరిగిన ఎన్నికల్లో 102 ఓట్లకు గాను 99, 24 ఓట్లకు గాను 22 ఓట్లు పడ్డాయి. ఇందుకుగాను వేర్వేరుగా పోలింగ్‌బాక్స్‌లను ఏర్పాటుచేశారు. ఈరెండింటిని రాజంపేట బార్ ఆఫీస్‌లోనే సీజ్ చేసి, కొత్తగా తీసుకొచ్చిన బీరువాలో భద్రపరిచారు. అలాగే బార్ కార్యాలయానికి కూడా తాళాలు వేశారు.

హైకోర్టును ఆశ్రయించి సురేంద్రబాబు..

రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షస్థానానికి పోటీచేసిన కోసూరు సురేంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. బ్యాలెట్ బాక్స్‌లు భద్ర పరిచే విషయంపై రిట్‌పిటిషన్ దాఖాలు చేశారు. ఈ పిటిషన్ హైకోర్టు స్వీకరించింది. మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు కడప జిల్లా కోర్టులో బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచాలని ఎన్నికల అధికారి బాలాజీని ఆదేశించారు. బ్యాలెట్‌బాక్స్‌లను కడప కోర్టుకు తరలించే నేపథ్యంలో బార్ ఆఫీసుకు వేసిన తాళాలు తీసేసి, యథావిధిగా బార్ అసోసియేషన్ కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

ఫలితాలపై న్యాయవాదుల్లో ఉత్కంఠ

అసోసియేషన్ ఎన్నికల ఫలితాలపై న్యాయవాదుల్లో ఉత్కంఠ నెలకొంది. సరేంద్రబాబు, లక్ష్మీనారాయణ అసోసియేషన్ అధ్యక్షస్థానానికి పోటీ పడ్డారు. ఇద్దరి గెలుపోటములపై న్యాయవాదులు ఎవరికి వారు ధీమాను వ్యక్తంచేస్తున్నారు. కాగా హైకోర్టు ఉత్తర్వులు వెలువడేవరకు ఓట్ల లెక్కింపు ఉండదు.

బంగారు గొలుసు అపహరణ

సింహాద్రిపురం : వైఎస్సార్ జిల్లా గురిజాల గ్రామానికి చెందిన సుబ్బలక్షుమ్మ మెడలోని బంగారు గొలుసు దొంగ అపహరించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు సుబ్బలక్షుమ్మ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న చీనీ తోట వద్దకు ఒంటరిగా వెళ్లింది. ఆమెను అనుసరించిన వచ్చిన దొంగ రోడ్డు మీద తన ద్విచక్ర వాహనాన్ని పెట్టాడు. ఆమె తోటలో చీనీ కాయలు ఏరుతుండగా.. దొంగ వెళ్లి ఆమెను తోసేసి బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. తోయడం వల్ల సుబ్బలక్షుమ్మకు తలకు, చేతికి గాయాలయ్యాయి. వెంటనే ఆమె లేచి పరుగెత్తుతూ దొంగ దొంగ అరిచినా ఎటువంటి ఫలితం లేకపోయింది. బంగారు గొలుసు సుమారు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.